# సుందర కాండ

## సుందర మకరందం



వక్త

ఆంధ్ర వాల్మీకి - కవి సార్వభౌమ

శ్రీ వాసుదాస స్వామి

అనువక్త - వాచవి

వనం జ్వాలా నరసింహారావు

దర్శనమ్ ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక విశిష్ట ప్రచురణ

# శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం...సుందరకాండ

శ్రీ రామాయణం క్షీరధార. వాసుదాసుగారి శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం, మందరాలన్నీ, మందార మకరంద మాధుర్యాలే. కవికులగురువు కాళిదాసు అన్నట్లు." చరిత్ర మా రాముడిది. రచన సాక్షాత్తు వాల్మీకుల వారిది. గానం చేసినవారు కిన్నెర గాత్రులైన కుశలవులు. ఇంతటి మహనీయమైన రామాయణ కావ్యంలో, శ్రోతలను పరవశింప చేయని అంశం అనేదేదీ లేదు".

భగవద్గీత, శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రం, శ్రీ రామాయణం భారతీయ సంస్కృతీ రూపాలు. సనాతన ధర్మ ప్రతిపాదకాలు. వీటి మౌలిక తత్వాలు ధర్మ-జ్ఞానాలు. ఈ రెండింటినీ వాచ్య-వ్యంగార్థాలతో శ్రీ మద్రామాయణం ఆవిష్కరిస్తోంది. వాల్మీకి ఆదికవి. రామాయణం ఆదికావ్యం. ఇది ధ్వని-అర్థ ప్రతిపాదిత మహా మంత్రపూతం. గాయత్రీ బీజసంయుతం. ఔపనిషతత్వసారం. స్మరణ-పారాయణ మాత్రంగా అంతఃకరణ శుద్ధి అవుతుంది.

వాల్మీకి రామాయణాన్ని యథావాల్మీకంగా, పూర్వ కాండలతో సహా ఉత్తరకాండను కూడా కలిపి తెనిగించిన ఏకైక మహాకవి కీర్తి శేషులు వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు) గారు. ఆ మహానుభావుడి ఆంధ్ర వాల్మీకి రామాయణం మందరాలన్నీ, తెలుగునేల నాలుగు చెరగులా విశేష ప్రాచుర్యాన్ని ఏనాడో సంతరించుకున్నాయి. కానీ, కాలక్రమంలో అవన్నీ మరుగున పడిపోతున్నాయి. రామాయణానికి రచయిత ఒక్కడే. వాల్మీకి మహర్షి తప్ప ఇతరులెవరికీ రామాయణం రచయిత అని చెప్పుకునే హక్కులేదనే అనాలి. వాసుదాసుగారు కూడా వ్యాఖ్యాతననే అంటారు తన ఆంధ్ర వాల్మీకి రామాయణానికి.

వాల్మీకి రామాయణ క్షీరసాగర మధనాన్ని చేసి "మందర" మకరందాలనూ, రమా రామ పారమ్య పీయూషాలనూ, నాలుగు చెరగులా పంచి, ఆ మథనంలో ఆవిర్భవించిన శ్రీ సీతారాముల తత్వాన్ని, వేద వేదాంగేతిహాస స్మృతి శ్రుతి శుభంగా అన్వయించి, ఆంధ్రుల హృదయ కేదారాలను ప్రపుల్లం చేసిన పరమ భాగవతోత్తములు "ఆంధ్ర వాల్మీకి" వాసుదాస స్వామి. "రామ భక్తి సామ్రాజ్యం యే మానవుల కబ్బెనో మనసా! ఆ మానవుల సందర్శనం అత్యంత

బ్రహ్మానందమే” అన్న త్యాగరాజ స్వామి వారి కీర్తనకు సాకార దివ్య స్వరూపులు వాసుదాస స్వామి. ఆంధ్ర వాల్మీకి వాసుదాస స్వామి అవతరించి వున్న కాలంలో, వారి దర్శన–అనుగ్రహ భాషణా సౌభాగ్యమబ్బిన వారు, “శ్రీ మద్రామాయణం–మందరం” పారాయణపరులై, తమ పరంపరకు శ్రీ వాసుదాస స్వామి గారి దివ్య స్మృతులను అందించి తరించారు. వాల్మీకి సంస్కృత రామాయణాన్ని అందరికంటే మొట్ట మొదలు ఆంధ్రీకరించి, పదే–పదే రామాయణ పఠన పాఠన శ్రవణాదుల పట్ల ఆంధ్రులకు అత్యుత్సాహాన్ని కలిగించి, “రామ భక్తి సామ్రాజ్యం” అంటే, ఆంధ్ర దేశమే సుమా, అనిపించిన నిరుపమ రామ భక్తులు వాసుదాస  స్వామివారు.

ఇరవై నాలుగు గాయత్రీ మంత్రాక్షరాలలో నిబంధించబడిన మంత్ర మంజూష వాల్మీకి మహర్షి రచించిన శ్రీమద్రామాయణం. మహా మహానుభావులూ, మహా విద్వాంసులూ కీర్తి శేషులు శ్రీమాన్ వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు) గారు, వాల్మీకి రామాయణాన్ని యధాతథంగా మంత్రమయం చేస్తూ, ఛందో యతులను ఆయా స్థానాలలో నిలిపి, వాల్మీకాన్ని తెనిగించారు. వాల్మీకి రామాయణానికి తుల్యమైన స్థాయినీ–పారమ్యాన్నీ, తొలుత నిర్వచనంగా ఆంధ్ర వాల్మీకి రామాయణానికి అందించి, తదనంతరం, “మందరం” అని దానికి విశేష ప్రాచుర్యాన్ని కలిగించారు. ఆంధ్ర పాఠక లోకం మందరాన్ని అపారంగా అభిమానించింది–ఆదరించింది.

వాసుదాసుగారి కీర్తికి ఆలవాలమైంది ఆంధ్ర వాల్మీకి రామాయణం. ఆంధ్ర భాషలో అంతకుముందు రామాయణానికి యధా మూలాలు లేవని, అర్థ పూర్తి కలిగి, కావ్య–ఇతిహాస గౌరవ పాత్రమై, సర్వజన పఠనీయమై, ప్రామాణికమై, మూలానుసరమైన రామాయణం తెలుగులో వుండడం లోకోపకారంగా భావించి, రచించించారీ గ్రంథాన్ని వాసుదాసుగారు. ఎనిమిదేళ్లలో రామాయణాన్ని తొలుత నిర్వచనంగా ఆంధ్రీకరించి, అలనాటి కడప మండలంలోని ఒంటిమిట్ట కోదండ రామస్వామికి అంకితం చేసారు . ఆయన రచించిన నిర్వచన రామాయణం, ఆయన జీవిత కాలంలోనే, నాలుగైదు సార్లు ముద్రించబడింది. ఆంధ్ర వాల్మీకి రామాయణం బాలకాండలో, తన స్వవిషయం గురించి ప్రస్తావిస్తూ

# రామాయణంలో ఏముంది.... ఆంధ్ర వాల్మీకి రామాయణం ఎందుకు చదవాలి?

## శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణానికి వాసుదాసుగారి పీఠిక

శ్రీ రామాయణం, భారతం, భాగవతం అద్వితీయమైన గీర్వాణ భాషా గ్రంథాలు. వేద వేదాంత అర్థోపబృంహితంబులు. ఈ మూడింటిలో ఆద్యమైంది శ్రీ రామాయణ కావ్యం. కావ్యాలలోకెల్లా ప్రధమంగా ఉత్పన్నమైంది కావడంతో ఆదికావ్యమైంది. శ్రీమద్రామాయణం–ఉత్తర కాండ 94వ సర్గలో చెప్పినట్లు రామాయణాన్ని చక్కగా తెలిసినవారు–అర్థం చేసుకోగలిగిన వారు మాత్రమే లోకానికి అందలి విషయాలను వివరించ సమర్థులు. అందరికీ అది సాధ్యమయ్యేది కాదు. (రామాయణ తత్వాన్ని తనకు తెలిసినంతవరకు ఆంధ్ర వాల్మీకంలో చెప్ప సాహసించానని, తన ఆ సాహసానికి క్షమించమని వాసు దాసు గారు పాఠకులకు విజ్ఞప్తి చేశారు).

మన పూర్వీకులకు తెలియని నాగరికతలు లేవు. మన పూర్వులు ఏ కారణం వల్ల ఆర్యులయ్యారు? వారు ఎటువంటి గుణాలు కలిగి, ఎటువంటి మహోన్నత స్థితిలో వుండే వారు? వారి నాగరికత విధానం ఎటువంటిది? వారి కులాచార ప్రవర్తనలెలావుండేవి? రాజుకు–ప్రజలకు మధ్య ఐకమత్యం ఎలా వుండేది? భార్యా–భర్తలు, సోదరులు, తల్లితండ్రులు, పుత్రులు పరస్పరం ఎలా ప్రవర్తించేవారు? సుఖ–దుఃఖాల విషయంలో స్త్రీ–పురుషులు ఏ విధమైన నడవడి గలవారు? వారికి దేవుడంటే ఎలాంటి ఆలోచన వుండేది? దైవాన్ని వారెలా ఆరాధిస్తుండే వారు? ఇలాంటి లౌకిక విషయాలను తెలుసుకోవాలనుకునే వారికి శ్రీ రామాయణాన్ని మించి తెలిపే గ్రంథం ఎక్కడా లేదు.

జననమరణ చక్రబంధంలో ఇరుక్కొని, పరిభ్రమిస్తూ, ఆ బాధ తొలగించు కునేందుకు పారలౌకిక చింత కలిగి, నిరామయమై–నిత్యమై–నిర్మలమైన పరమపదానికి పోవాలనుకునే కోరికగల వారికి, కరతలామలకంగా సుఖమైన మార్గాన్ని బోధించగల గ్రంథం శ్రీ రామాయణం తప్ప మరొకటి లేదు.

కాలక్షేపానికి చదవడానికైనా శ్రీ రామాయణం లాంటి పుస్తకం ఇంకోటి లేదు. ఏ విధంగా చదివినా, చదివిన తర్వాత, సమయాన్ని సద్వినియోగం చేశామన్న తృప్తినిచ్చేది రామాయణమే. శ్రద్ధా భక్తులతో చదివినవారికి కల్పవృక్షంలా కోరిన కోరికలు తీర్చేదీ రామాయణమే. కాబట్టి, ఇహ-పరలోకాల్లో సుఖపడాలనుకునేవారికి, శ్రీ రామాయణ పఠనం అవశ్య కర్తవ్యం.

భరతఖండంలో శైవులని, వైష్ణవులని, శాక్తేయులని భిన్న మతాల వారున్నారు. అయితే వీరిలో కొందరు వైష్ణవులకు శైవుడంటే ఇష్టం లేకపోవడం, అలానే నారాయణుడి పేరంటే నే ముఖం చిట్లించుకునే శైవులుండడం అందరికీ తెలిసిందే. ఐనప్పటికీ, శ్రీ సీతారాముల పేరు విన్న ప్రతి ఆర్యుడు మనస్సులోనైనా భక్తితో నమస్కారం చేసుకోవాల్సిందే. ఇలా సీతారాములు సార్వజనీన సం పూజ్యులు కావడానికి కారణమేంటి? హరిశ్చంద్రుడిలాంటి సత్యాత్ములు, ధర్మరాజు లాంటి ధర్మాత్ములు, దమయంతి-సావిత్రి లాంటి పతివ్రతలు లేరా? వారి మీద ఎంత గౌరవం వున్నా లోకులు వారిని పూజించడం లేదే? మరి, సీతారాములలో విశేషమేమిటంటే, వారు అవతారమూర్తులు కావడమే! ఎవరెవరు-ఏఏ పేరుతో పిలిచినా, భగవంతుడనేవాడు ఒక్కడే అని ఆర్యుల నమ్మకం. భిన్న-భిన్న రూపాల్లో దర్శనమీయడం భవత్కేళా విశేషం. అలాంటి భగవంతుడే, శ్రీరాముడుగా, లోకరక్షణార్థం జన్మించాడన్న నమ్మకమే, లోకులందరు ఒకేవిధంగా శ్రీ సీతారాములను అర్చన చేయడానికి కారణమైంది. ప్రత్యక్షానుభవమున్న భక్తులే దానిలోని గూడార్థాన్ని వెల్లడిచేయగల సమర్థులు-శక్తిమంతులు. అలాంటివాడైన వాల్మీకి మహర్షి ఆ అవతార రహస్యాన్ని, తాను గ్రంథస్థం చేసిన శ్రీ రామాయణంలో, "కంఠోక్తి ఘోషించినాడు".

"శ్రీ రామాయణం" అంటే, లక్ష్మీరమణుడైన శ్రీమన్నారాయణుడి మాయా మానుషావతారమైన శ్రీరామ చరిత్ర అనీ, శ్రీ లక్ష్మీదేవి అవతారమైన సీతాదేవి చరిత్ర అనీ అర్థం. దంపతుల మాదిరిగా, వారి "అభిధానంబులు అనపాయంగా" వుండినట్లే, తత్త్వమెరిగిన మహాత్ముడు వాల్మీకి మహర్షి, తను రచించిన ఆది కావ్యానికి శ్రీ రామాయణం అని పేరు పెట్టాడు. ఇందులో సీతాదేవి మహాత్మ్యాన్ని విశేషించి చెప్పడంవల్ల వాల్మీకి మహర్షే, శ్రీ రామాయణాన్ని "సీతాయాశ్చరితం

# వాల్మీకి రచించిన శ్రీమద్రామాయణానిదే కావ్యాలలో అగ్రస్థానం

శ్రీ సీతారామలక్ష్మణ భరత శత్రుఘ్నుల చరిత్రను, వీరు ఆచరించిన ధర్మాలను అన్ని లోకాలకూ శాశ్వతంగా చెప్పేందుకు, శత కోటి గ్రంథాత్మకమైన ప్రబంధంగా, ఓ బృహత్ గ్రంథాన్ని రచించి నారదుడికి, ఇతర మహర్షులకు ఉపదేశించాడు బ్రహ్మదేవుడు. అంతటితో ఆగకుండా భూలోక వాసుల కొరకై శ్రీరామ భక్తుడైన వాల్మీకికి ఉపదేశించమని నారదుడిని ఆదేశించాడు. వాల్మీకి రచించిన రామాయణం బ్రహ్మ ప్రేరేపించినదే.

వాల్మీకి సంస్కృతంలో రచించిన శ్రీమద్రామాయణం కావ్యాలలో అగ్రస్థానంలో నిలిచింది. శ్రీమద్రామాయణంలో నాయిక సాక్షాత్తు శ్రీదేవైన సీతా దేవి. నాయకుడు మహావిష్ణువైన శ్రీరామచంద్రమూర్తి. వీరిరువురు త్రేతాయుగంలో దుష్ట శిక్షణ-శిష్ట రక్షణ చేసి, ధర్మ సంస్థాపన చేసేందుకు అవతరించారు. ఇహ-పర సాధకంబులైన "స్వధర్మాలలో, స్త్రీ ధర్మం సీతని, పురుష ధర్మం శ్రీరామచంద్రమూర్తని లోకానికుపదేశించాడు వాల్మీకి.

శ్రీరామచంద్రుడు బాలుడుగా వున్నప్పుడు జరిగిన సంగతులు తెలిపేది "బాల కాండ". ఇందులోనే సీతాకల్యాణ ఘట్టం అత్యంత మనోహరంగా రాసారు వాల్మీకి కవి. "కాండం"అంటే జలం...అంటే నీరు. శ్రీ రామాయణం మహార్ణవంగా చెప్పడంవల్ల, అందులోని జలం కాండమన్నారు. శ్రీ రామాయణంలోని బాల కాండలో శ్రీరామచంద్రమూర్తైన విష్ణువే "జగజ్జనన కారణభూతుడు" అని బోధపడుతుంది. జననం మొదలు ఇరవై అయిదు ఏళ్లు వచ్చేవరకూ రాముడు చేసిన చర్యలు ఈ కాండలో వున్నాయి. పన్నెండో ఏట పెళ్లైనప్పటినుండి పట్టాభిషేకం ప్రయత్నం జరిగే వరకు చెప్పుకోదగ్గ విశేషం ఏమీలేదు. బాల కాండ వృత్తాంతమంతా 12 సంవత్సరాల కాలంలో జరిగింది.

రామాయణ రచనకు పూనుకున్న వాల్మీకి మహర్షి, భగవద్విషయాన్ని బోధించే యోగ్యతలున్న గురువు దొరకలేదనే నిర్వేదంతో శుష్కించి, తన ఆశ్రమానికి వచ్చిన నారదుడికి సాష్టాంగ నమస్కారం చేసి: "గుణవంతుడు, అతివీర్యవంతుడు, ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సత్యశీలుడు, సమర్థుడు, నిశ్చల

సంకల్పుడు, సదాచారం మీరనివాడు, సమస్త ప్రాణులకు మేలు చేయాలన్న కోరికున్నవాడు, విద్వాంసుడు, ప్రియదర్శనుడు, ఆత్మవంతుడు, కోపాన్ని స్వాధీనంలో వుంచుకున్నవాడు, ఆశ్చర్యకరమైన కాంతిగల వాడు, అసూయ లేనివాడు, రణరంగంలో దేవదానవులను గడ-గడలాడించ గలవాడు ఎవరైనా వున్నారా ఈ భూలోకంలో?" అని పదహారు ప్రశ్నలు వేస్తాడు. వాస్తవానికి ఈ గుణాలన్నీ వున్నవాడు శ్రీరామచంద్రుడే! అందుకే ఆయన చరిత్రను మనకందించాడు వాల్మీకి మహర్షి.

బాల కాండలో శ్రీ మహావిష్ణువు భూమిపై అవతరించాల్సిన కారణం, అయోధ్య కాండలో స్థితి కారణం, అరణ్య కాండలో మోక్షమిచ్చే అధికారం, కిష్కింధ కాండలో గుణ సంపత్తి, సుందర కాండలో సర్వ సంహార శక్తి, యుద్ధ కాండలో వేదాంత వేద్యత్వం, ఉత్తర కాండలో సృష్టికి హేతువు లాంటి విషయాలను చెప్పడం జరిగింది. రామాయణంలో చెప్పబడిన పరతత్వం శ్రీరామచంద్రమూర్తిగా అవతరించిన విష్ణువేనని స్పష్టమవుతుంది. ఇటువంటి పరతత్వాన్ని స్థాపించి, పరమాత్మ అనుభవించే ఉపాయం శరణాగతని అర్థం చేసుకోవాలి. శరణాగతికి ముఖ్య ఫలం, భగవత్ సన్నిధానంలో చేరి, భగవంతుడికి సేవ చేయడమే. శరణాగతికి పురుష కారం అవశ్యం. పురుష కారానికి కావాల్సిన ముఖ్య గుణం శరణాగతుడి పట్ల దయ. రామాయణంలో పురుష కారం ప్రధానమైంది. శరణాగతుని అనుష్టించు అధికారికి శేషత్వం పారతంత్ర్యం స్వరూపం. భరతుడి చర్య వలన పారతంత్ర్యం స్పష్టంగా కనిపిస్తుంది. శత్రుఘ్నుడి చర్యలు భాగవత పారతంత్ర్యాన్ని తెలియచేస్తుంది. మనం సదా జపం చేయాల్సింది రామాయణమే.

రామావతారం పూర్ణావతారమే. అంటే ప్రకృతి సంసర్గం లేదు. శరీరం అప్రాకృతం. ప్రకృతి గుణాలు ఆయన్ను బాధించవు. రామచంద్రమూర్తి శోకించాడని వాల్మీకి రాసిందీ అసత్యం కాదు. నిజంగానే శోకం కలిగిందాయనకు. అయితే శోకం కలిగింది తన కొచ్చిన కష్టానికి కాదు. తమకు దుఃఖాలొచ్చాయని మనుష్యులు దుఃఖిస్తారు. తనకై, తన ఆప్తులకు దుఃఖం కలిగిందికదానని, తన మూలాన వీరికింత దుఃఖం ప్రాప్తించిందికదానని, వారి దుఃఖాన్ని ఆపాల్సిన తానే వారి దుఃఖానికి కారణమయ్యానని మాత్రమే

# సర్గ-1

## సుందరకాండ పారాయణ కథా ప్రారంభం

## మహేంద్ర పర్వతంపై విహరించిన హనుమంతుడు

మంత్ర మాత్రుక అయిన గాయత్రీ మంత్ర దివ్య విన్యాసం ఆద్యంతాలూ నింపుకున్న ఇంపైన కాండ సుందరకాండ. ఈ కాండ "త" కారంతో మొదలై, "త" కారంతోనే ముగుస్తుంది. "తరువాత రావణాసుర" అనే పద్యంతో వాసుదాసు గారి సుందరకాండ మొదలవుతుంది. శిష్యుడున్న చోటు వెతికే ఆచార్య స్వరూపం ఇందులో విశదీకరించడం జరిగింది. భగవదనుజ్ఞ లేకుండాఎవరు కూడా ఆచార్యత్వం నెరపలేరన్న విషయం కూడా ఇందులో స్పష్టం చేయడం జరిగింది. అదే విధంగా దూత అనేవాడు, తన స్వామి చెప్పిన మాటలను తెలియచేయడంతో పాటు, శత్రువులు నిరోధించినప్పటికీ, ఎదుర్కొని, విజయవంతంగా తిరిగొచ్చి తాను చేసిన పనులను నివేదించగల వాడై వుండాలనే వ్యంగార్థాన్ని ఇది ధ్వనిస్తుంది. ఇందులో గురు లక్షణాలూ చెప్పబడ్డాయి. హనుమంతుడికి భగవదనుజ్ఞ వుందనడానికి గుర్తు, శ్రీరాముడు ఆయనకిచ్చిన తన ముద్రికే!

"శ్రుతి, స్మృతి, సదాచారం, స్వప్రియం, శీలం" అనేవి ధర్మ నిర్ణయానికి ప్రామాణికాలు. రావణుడి అంతఃపురంలో ఎందరో స్త్రీలను చూసినప్పటికీ హనుమంతుడి మనస్సు చలించదు. లంకాదహనం, అక్షకుమారాది వధ, గురుచారణ మార్గంలో జరిగినవని అనడంలో అర్థం: దూత కృత్యం ధర్మ మార్గానికి అవిరోధంగా చేయడమే! హనుమంతుడికి రామాజ్ఞ వుంది. అది రామాజ్ఞ కాబట్టి వేదానుశాసనమే! ఇలా ఎన్ని రకాలుగానో, హనుమంతుడిలో పరిపూర్ణమైన ఆచార్య లక్షణాలు కలవన్న విషయం తెలియచేస్తూ, అట్టి వాడికే శిష్యాన్వేషణ ఫలిస్తుందన్న సంగతి చెప్పడం జరిగింది. సుందరకాండలో శిష్య లక్షణమూ చెప్పడం జరిగింది. శిష్యుడి ప్రథమ లక్షణం "సీత" లాగా వుండడమే!

జాంబవంతుడి ప్రేరణతో వానరులతో కూడి హనుమంతుడు మహేంద్ర పర్వతాన్ని ఎక్కుతాడు. అక్కడినుండి లంకకు వెళ్లాలన్నదే ఆయన సంకల్పం.

దానిని కార్యరూపంలోకి తేవడానికి సిద్ధపడ్డాడు హనుమంతుడు. రామదూత, శత్రు సంహారకుడైన హనుమంతుడు, రావణుడు అపహరించిన సీతాదేవిని లంకలో వెతికేందుకు ఆకాశ మార్గాన అక్కడకు ప్రయాణమవుతాడు. రావణ నీత అయిన సీతను అన్వేషించేందుకు సిద్ధపడుతున్నాడప్పుడు. సీతాదేవిలాంటి పతివ్రతా శిరోమణి పాద దర్శనం కలిగినా తాను కృతకృత్యుడైనట్లేనని ఆంజనేయుడి భావన. దీనివలన సీతా మహాత్మ్యం, హనుమంతుడి భక్తి, వినయాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. భక్త ప్రపన్నులకు సీతారాములిద్దరూ సేవ్యులే కదా!

హనుమంతుడు తాను పయనించాల్సిన మార్గాన్ని ఒకసారి తేరిపార చూశాడు. తల, మెడ నిక్కపొడిచి, మదించిన కోడెనాగు లాగున్న హనుమంతుడు అత్యంత సుందరాకారుడిలాగా కనిపించాడప్పుడు. ఏ కాలంలో, ఏ దేశంలో, ఎవ్వరికీ సాధ్యపడని ఓ ఘనకార్యం చేయాలన్న తలంపు హనుమంతుడి మనస్సులో కలిగింది. వానర శ్రేష్ఠుడైన హనుమంతుడు దీర్ఘంగా ఆలోచిస్తూ ముందుకూ, వెనుకకూ తిరుగుతాడు. పక్షులను బెదిరించాడు. జంతువులను అదిలించాడు. రొమ్ము, నుదురుతో తాకుతూ చెట్లను పడేశాడు. కొండను వూగేట్లు చేశాడు. విజృంభించిన సింహం మాదిరి సంచరించాడు.

నలుపు, తెలుపు కలబోసిన వర్ణ చిత్రంలాగా, ఆకుపచ్చతో సహా వివిధ రంగులతో వృద్ధి చెందిన లోహాదులతోనూ, కాంతివంతమైన ఆభరణాలతోనూ, అలంకరణ చేసుకున్న యక్షులు, కిన్నరులు, దేవతలు, దేవతాస్త్రీల గుంపులతోనూ, మనోహరమై, మదించిన గజసమూహాలు ఎళ్లవేళలా సంచరించే ఆ మహేంద్ర పర్వతంపైన హనుమంతుడు విచ్చలవిడిగా తిరుగుతూ ప్రకాశించాడు.

సూర్యుడికి, ఇంద్రుడికి, వాయుదేవుడికి, బ్రహ్మకు, ఇతర దేవతలకు అణకువతో నమస్కరించి ప్రయాణానికి సన్నాహమవుతాడు హనుమంతుడు. సూర్యుడు ఆయనకు విద్యా గురువైనందున తొలుత నమస్కరిస్తాడు. రాక్షసులతో యుద్ధానికి పోతున్నాడు కాబట్టి రాక్షస విరోధి ఇంద్రుడికి ఆ తర్వాత నమస్కరిస్తాడు. బలం, వేగం కలగాలని తండ్రి వాయుదేవుడికి నమస్కరిస్తాడు.

# సర్గ-3

## ప్రాకారం చేరి ఆలోచించిన హనుమంతుడు

## లంక బహుముఖ ఐశ్వర్యానికి మురిసిపోయిన హనుమ

వరుస ఉద్యానవనాలతో, రమ్యమైన నీటితో, శరత్కాల మేఘాల్లాంటి తెల్లటి ఇండ్లతో, సముద్ర ఘోషకు సమానమైన చప్పుళ్లతో, ఇంపైన వాకిళ్లు, తోరణాలతో, మెల్లగా వీస్తున్న పిల్లగాలులతో, బంగారువన్నె ఇంటి ప్రహరీ గోడలతో, మంటపాలతో అలరారుతూ, చిరుగజ్జెల సవ్వడితో కీర్తికెక్కిన అమరావతీ, భోగవతీ నగరాలను మరిపించే లంకాపురిని ప్రవేశించడానికి లంబ పర్వతంపైనుండి దిగుతాడు హనుమంతుడు. ఆయన దిగిన లంబ పర్వతమప్పుడు చీకట్లో వేలాడే పర్వతంలాగా వుంది. ఆలకాపురితో సమానంగా, చక్కటి పోషణలో వుంటూ, బలీయమైన సేనల గుంపులతో, మెరుపులతో నిండిన మేఘంలాగా, ఎంతో చిత్ర, విచిత్రంగా వుందే ఈ లంకానగరం! అనుకుంటాడు హనుమంతుడు.

ఇంద్రుడి పట్టణమైన "వస్వౌకసార"ను, యముడి పట్టణమైన "సమ్యమని"ని, వరుణుడి పట్టణమైన "సుఖ"ను, సోముని పట్టణమైన "విభావతి"ని, పవమానసుతుడు జ్ఞప్తికి తెచ్చుకున్నడు, లంకా నగర సౌందర్యాన్ని చూసి. ఇట్లా మనసులో అనుకుంటూ, ప్రాకార సమీపాన్నుండి లంకా నగరాన్నొక్కసారి తేరిపార చూస్తాడు హనుమంతుడు. బంగారు తలుపులు, వైడూర్యపు అరుగులు, వజ్రాలు, ముత్యాలు, రత్నాలతో కట్టబడిన నేలలు, బంగారపు తొడుగులతో వున్న ఇళ్లు, శుభ్రంగా వున్న సోపానాలు, ఆకాశానికి ఎగురుతున్నారా అనిపించే బలవంతులు, హంసలు, నెమళ్లు కలిసి చేస్తే వచ్చే ధ్వనితో నిండిన ఆకాశం కనిపిస్తాయి హనుమంతుడికి. ఇంద్రుడి పురమనదగి, మనోహరమైన ఆ రావణుడి పట్టణాన్ని, దాని గొప్పతనాన్ని తిలకించి, ఎంతో సంతోషంతో దాన్ని గురించి మరీ, మరీ అనుకుంటాడు మనస్సులో హనుమంతుడు.

ఒరనిండా, చేతిలో, కత్తులుంచుకుని తిరిగే సైనికుల రక్షణలో వున్న ఈపట్టణాన్ని బలంతో గెలవడం ఎవరికీ సాధ్యం కాదేమో ననుకుంటాడు హనుమంతుడు. అయితే, అంగదుడు, ద్వివిదుడు, సుగ్రీవుడు, మైందుడు, సుషేణుడు, రుక్షుడు, కుముడు, కుషపర్వుడు, కేతుమాలుడు మాత్రం లంకలో ప్రవేశించ గలరనుకుంటాడు. (మొదట్లో లంకను చూసినప్పుడు నలుగురు మాత్రమే లోనికి రాగలరనుకుంటాడు. ఇప్పుడు ఆ సంఖ్యను తొమ్మిదికి పెంచాడు. కార్యభారం తెలియని మూర్ఖులు, మొదట్లో తమను, తమవారిని, ఎక్కువగా అంచనా వేసుకుంటారు. చివరకు వెల్లికిలా పడ్తారు. ఆలోచనాపరులు, బుద్ధిమంతులు, కార్యభారం తెలుసుకుని, ఇది మనం చేయగలమా? మనవల్ల జరుగుతుందా? అని తొలుత జంకుతారు. ఎట్లాగూ ఈపని నెరవేర్చక తప్పదుకదా! అని, కొంచం, కొంచం చేయడం మొదలెట్టి, క్రమంగా ధైర్యం తెచ్చుకుంటారు. కార్యాన్ని సాధిస్తారు. ఇన్ని ఆలోచనలు చేసినప్పటికీ, తానొక్కడే రాక్షసులను జయించి, లంకను కాల్చి వచ్చాడు గదా హనుమంతుడు)

ఈ ప్రకారం, లంకలోకి రాగల బలవంతులగు వానరులను లెక్కపెట్టి, రామలక్ష్మణుల బలపరాక్రమాలను ఆలోచించి, భయపడాల్సిన పనిలేదు, వారు వస్తే విజయం కలుగుతుందని సంతోషపడ్తాడు, (రామలక్ష్మణులు కూడా ఇక్కడ ఏమీ చేయలేరని మొదట్లో అధైర్యం పొందినా ఇప్పుడు ధైర్యం తెచ్చుకుంటాడు). ఇలా ఆలోచిస్తూ మరీ, మరీ సమీపంలోకి పోతాడు హనుమంతుడు. పోతున్న అతడికి, రావణుడి పట్టణం, మణులనే దుస్తులు కప్పుకొన్నట్లుగా, పశువుల కొట్టం లాంటి శిరోభూషణాలు కలదిగా, యంత్రశాలను పోలిన స్తనాలున్నట్లుగా, అలంకరించుకున్న స్త్రీ లాగా కనిపిన్చింది. (లంకా నగరాన్ని స్త్రీలాగా వర్ణించడమంటే లంకాధి దేవత రాక సూచించడమే). ఆయన ఇలా లంకను గురించి అనుకుంటుండగానే లంక స్త్రీగా రానే వచ్చింది.

చీకటనేది రాకుండా వుండేందుకై, నవరత్న ఖచిత ఇండ్ల సముదాయంతో నిర్మించిన లంకానగరంలో ప్రవేశిస్తున్న కోతిని లంకాదిదేవత లంఖిని తన సహజ రూపంతో చూసింది. అదే సమయంలో ఆమెనూ చూసాడు హనుమంతుడు. తక్షణమే కోపంతో వూగిపోతూ అసహ్యామైన ముఖాన్ని,

# సర్గ-9

## రావణుడి అంతఃపురాన్ని పరిశీలించిన హనుమంతుడు

పుష్పక విమానం మధ్యలో, అర్ధ యోజనం వెడల్పు, యోజనం పొడవున్న రావణుడి ఇంటిని చూసి, అందులోకి పోయి, అక్కడ సీతాదేవి కనపడుతుందేమోనని వెతకసాగాడు హనుమంతుడు. మేడలనేకం వున్న రావణుడి నగరంలోని బలవంతులైన రాక్షసుల ఇళ్లలోనూ, రావణుడుంటున్న ఇంటిలోనూ, తనకార్యక్రమాన్ని కొనసాగించాడు మారుతి.

ఆ ఇంట్లో మూడు-నాలుగు కొమ్ములున్న ఏనుగులు, దూరం-దూరంగా కట్టబడి వున్నాయి. యుద్ధానికి సిద్ధంగా ఆయుధాలెత్తి నిలబడ్డ యోధులు కాపలాకాస్తున్నారా ఇంటిని. రావణుడి భార్యలతో-వాడపహరించుకుని వచ్చిన స్త్రీలతో, రాచ కన్నెలతో నిండి వున్నదా ఇల్లు. తిమింగలాలు, మొసళ్లు, పొడుగాటి చేపలు, ఇతర జలచరాలతో కలతచెంది అల్లకల్లోలమైన సముద్రంలా వుందా ఇంటి ప్రదేశం. కుబేరుడి సంపద, ఇంద్రుడి ఐశ్వర్యం, దిక్పాలకులందరి లక్ష్మి ఆ ఇంట్లోనూ, వాడి బంధువుల ఇండ్లలోనూ వుంది. ఇవన్నీ గమనించాడు హనుమంతుడు.

అలాంటి అందాల మేడల మధ్యలో వున్న పుష్పక విమానానికి గత చరిత్ర ఎంతో వుంది. విశ్వకర్మ బ్రహ్మదేవుడి కొరకు రత్నాలతో పొదిగి ఆకాశంలో నిర్మించాడు దానిని మొదట. తనను సేవించిన కుబేరుడికిచ్చాడు బ్రహ్మ కొంతకాలం తర్వాత. కుబేరుడిని యుద్ధంలో గెల్చి, రావణుడు లాక్కున్నాడు దాన్ని. కృత్రిమ జింకల్లాంటి బొమ్మలతో అలంకరించబడిందా విమానం. బంగారపు కంబాలున్నాయి. ధగ-ధగ కాంతులు విరజిమ్ముతూంది. మేరునగమంత ఎత్తుగా వుంది. ఆకాశాన్ని రాసుకుంటూ, మిట్ట మధ్యాహ్నం సూర్యుడిలా ప్రకాశిస్తున్నది. బంగారపు మెట్లు, అరుగులు, కిటికీలున్నాయి. నీలాలు, పగడాలు, మంచి ముత్యాలతో చెక్కబడిందది. అట్టి హంగులున్న విమాన ప్రదేశం పైకెక్కాడు హనుమంతుడు. (ఎంతమంది ఎక్కినా మరొకరికి

స్థానంకూడా కలిగి వుండటాన్ని పుష్పక విమానంతో పోలుస్తుంటాం మనం. కానీ ఆంధ్ర వాల్మీకి అలా చెప్పలేదు-వాల్మీకి అలా అనలేదు. ఇది గమనార్హం.)

ఆ సమయమ్లో అప్పచ్చులు, పాకాలు, పులిహోర, దధ్యోదనము, కేసరీబాత్, వాంగీబాత్ లాంటి వంటకాల కమ్మని వాసనలు హనుమంతుడిని సంతోషపెడుతూ, తనను బంధువులా రావణాసురుడు తింటానికి రమ్మని పిలుస్తున్నట్లు అనిపించింది. ఆవాసన జాడపట్టుకుని పోసాగాడు హనుమంతుడు. పోతూ గమనించాడెన్నో దృశ్యాలను. మనోహర రత్న సోపానాలున్న, బంగారు కిటికీలున్న, దంతపు బొమ్మలున్న, పగడాలు, ముత్యాలు, బంగారం, వెండి కలయికల పటుత్వంతో తీర్చిన స్తంబాలున్న, ఆకాశానికెగురగల చిత్రాలు దిద్దిన కంబళ్లున్న, ఇంపు-సొంపైన పొడవాటి సుందరీమణిలాంటి-రావణుడి ప్రియభార్య కాగల లక్షణాలున్నటువంటి, ఇన్నింటిని చూస్తాడు హనుమంతుడు. కమ్మని సువాసనలు వ్యాపించి-పక్షుల ధ్వనులు మిన్నుముట్టుతుండగా- మెత్తని పరుపులు కాంతులీనుతుండగా, రావణాసురుడు తిరిగే ఆ ఇల్లు, సాంబ్రాణి-అగరు వత్తుల పొగలతో, ధూమ్రవర్ణంతో అలరారింది.

రావణాసురుడి రక్షణలో వున్న ఆ ఇల్లు, ఇంపైన ధ్వనులతో వీనులకు-రూపాలతో కళ్లకు-త్రాగటానికి ఇంపైన వాటితో చర్మానికి-వాసనలతో ముక్కుకు- నోరూరిస్తూ నాలుకకు తృప్తినిచ్చాయి హనుమంతుడికి. ఈ పంచేంద్రియ సుఖాలు తల్లివలె తృప్తినిచ్చాయి హనుమంతుడికి. (భార్య వల్ల కలిగే సుఖాలు "తల్లివలె" అనడంలో అర్థం, హనుమంతుడి జితేంద్రియత్వాన్ని గురించి చెప్పడమే).

(పై వర్ణనంతా కవి చేస్తూ, ముత్యాల గురించిన వివరణ ఇస్తారు కవి. ముత్యాలు: మేఘాలలో-పాముపడగలలో - వెదుళ్ళలో - చేపల్లో - ఏనుగుకుంభాల్లో - చెరకుల్లో-శంఖాల్లో - పంది కోరల్లో - ముత్యపు చిప్పల్లో, పుట్టాయట. మేఘాల్లో పుట్టేవి మానవులకు లభించవు. పాముపడగలోని ముత్యం గురివింద గింజ వన్నెలో వుంటుంది. వెదురులో పుట్టేది మినుప గింజంత పరిమాణంలో నక్షత్ర కాంతికలిగి స్త్రీ వశీకరణకు వుపయోగపడ్తుంది. చేపతలపై వుండే ముత్యం తెల్లగా-మల్లెపువ్వులా వుంటుంది. ఏనుగు కుంభంలో దొరికేది

# సర్గ-14

## అశోకవనం ప్రవేశించిన హనుమంతుడు

దిగులుపడి, తేరుకుని, ఆలోచించిన హనుమంతుడు మెల్లగా ఆ ఉద్యానవనంలోని ప్రాకారం మీదకు గెంతుతాడు. అక్కడ నిలబడి దేహమంతా పులకరిస్తుండగా శోకనాశి అయిన అశోకవనాన్ని తేరిపార చూసాడు. వసంతకాలం ఆరంభంలో పూలతో వికసించే కొమ్మలున్న చెట్లెన్నో వున్నాయక్కడ. మద్దులు, చీకటి మ్రాకులు, తక్కోలాలు, గిరికతాటిచెట్లు, ఉద్దాలకచెట్లు, అశోకచెట్లు, తియ్యమామిడిచెట్లు, సంపెంగలు, కోతిమూతికాయలున్న చెట్లు, అనేక ఇతర చెట్లతో ఆ వనం చూడచక్కగా వుంది. వాటిని చూసిన ఆంజనేయుడు అల్లెతాడు విడిచిన బాణంలా , సూటిగా, వేగంగా అక్కడకు పోతాడు. పక్షుల కిలకిలారావాలతో, బంగారు, వెండి చెట్లతో, ఆశ్చర్యం కలిగించే పక్షులతో, మృగాలతో, ఉదయభానుని పోలిన చిగుళ్లతో, పసరుకాయలతో, దోరపండ్లతో, ముదిరిన పండ్లతో, కోకిలల, తుమ్మెదల, నెమళ్ల ధ్వనులతో నిండిన అశోకవనాన్ని చూసాడు హనుమంతుడు. ఆయన అలికిడికి చెట్లపైనున్న పక్షులు నిద్రలేచి కిల-కిల కూయడం మొదలెట్టాయి. (పక్షులు నిద్ర లేచాయంటే హనుమంతుడు కోతిరూపంలో చెట్టు మీదినుండి చెట్టు మీదికి దాటుతూ, కాపలా వున్న రాక్షసుల కంట బడకుండా, సీత తప్పక మేలుకునే వుంటుందని భావించి ఆమెను వెతకసాగాడని అర్థమౌతున్నది)

హనుమంతుడు ఒక చెట్టు మీదినుండి మరో చెట్టు మీదికి దూకటంతో, ఆ అలికిడికి, కొమ్మలు కదిలి, పక్షులు లేచి, కిలకిల కూస్తూ, ఆకాశానికి ఎగిరిపోతుంటే, వాటి రెక్కల తాకిడికి, జలజలా రాలిన పూలనడుమనున్న అతడు పూలకొండలా కనిపిన్చాడు. భూతకోటికాతడు వసంతుడిలా, చెట్లపైనుండి రాలిన పూలతో నిండిన భూమి అలంకరించుకున్న స్త్రీలా వున్నాడప్పుడు. ఆయన వేగంతో కదిలిన చెట్లు హనుమంతుడి మీద పూలవాన కురిపించడంతో పాటు-పూలు, పండ్లు, ఆకులు రాలిపోసాగాయి. **(పుష్ప వృష్టి, అలంకృత స్త్రీ దర్శనం శుభ శకునాలు)**

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Srimadandhra+Valmiki+Ramayanam+Sundara+Kanda+Mandara+Makarandam**

* * *